ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
5
విజయనగరం



ఆప్కోలో చేనేత వస్త్ర క్లియరెన్స్ సేల్

డివిజినల్ మార్కెటింగ్ అధికారి జగదీశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఉగాది వేడుకను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కోలో ఎంపిక చేసిన వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు క్లియరెన్స్ సేల్ ను ప్రారంభించినట్లు ఆప్కో డివిజినల్ మార్కెటింగ్ అధికారి టి. జగదీశ్వర రావు తెలిపారు. ఒకటి కొంటే మరొకటి ఉచితం, ఒకటి కొంటే రెండు ఉచితం వంటి ప్రత్యేక తగ్గింపు ధరలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్లియరెన్స్ సేల్ కౌంటర్ ను పూల్ బాగ్ కాలనీలోని శివాలయం ఎదురుగా ఉన్న ఆప్కో భవన్ వద్ద ప్రారంభించినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగునీటి రంగంపై
నిర్లక్ష్యపు వరద

తోటపల్లి ప్రాజెక్టు

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2019-20	రూ.156 కోట్లు	రూ.13.64కోట్లు
2020-21	రూ.225.57కోట్లు	రూ.37.27కోట్లు
2021-22	రూ.199.70కోట్లు	రూ.1.35కోట్లు
2022-23	రూ.126.61కోట్లు	రూ.4.26
2023-24	రూ.80.84కోట్లు	రూ.????

జంఝావతి ప్రాజెక్టుకు రూ.39.60 లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72 లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు కేటాయింపు

తాటిపూడి, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునికీకరణకు కేటాయింపులు సున్నా.

- తోటపల్లికి రూ.556 కోట్లు అడిగితే రూ.80 కోట్లు కేటాయింపు
- రామతీర్థసాగర్‌కు రూ.50 కోట్లతో సరి
- ఆండ్ర, తాడిపూడి, పెదంకలాం, వెంగళరాయ వంటి జలాశయాలకు మరీదారుణం
- పారిశ్రామికాభివృద్ధికీ కానరాని కేటాయింపులు
- నవరత్నాలతో సరి
- నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

రామతీర్థసాగర్

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2021-22	రూ.201 కోట్లు	రూ.28.49 కోట్లు
2022-23	రూ.124.50 కోట్లు	రూ.00.00
2023-24	రూ.50 కోట్లు	రూ.????

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వాసులను మరోసారి నిరాశకు గురిచేసింది. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు కేటాయింపులు తప్ప, జిల్లా అభివృద్ధికి, తలసరి ఆదాయం పెంచేందుకు దోహదపడే విధంగా నిధులు కేటాయింపులు లేవు. ముఖ్యంగా 80శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయానికి అత్యంత కీలకంగా వున్న సాగునీటి రంగంపై ఎప్పటి మాదిరిగానే తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా నాలుగో వంతు కూడా కేటాయించలేదు. అసలే మన జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ఎయిర్‌పోర్టుకు ఎప్పటి మాదిరిగానే అరకొర నిధులతో చేతులు దులుపుకున్నారు. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడిడబ్ల్యుఎం పనులకు రూ.107.69కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.107.06కోట్లు చొప్పున మొత్తం రూ.556.03కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పెండింగ్ పనులకు రూ.73.13కోట్లు, భూమి కొనుగోలుకు రూ.3.75కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.3.96కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురిచేస్తున్నాయి. పెండింగ్ పనుల వల్ల 58,757ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తారకరామతీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు రూ.101.31కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.175 కోట్లు, భూసేకరణకు రూ.38.24కోట్లు చొప్పున మొత్తం రూ.314.55కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.50కోట్లు కేటాయించారు. ఇందులోనూ పునరావాసానికి రూ.10కోట్లు పోతే పనులకు మిగిలినవి కేవలం రూ.40కోట్లే. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికీ అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. జంఝావతికి రూ.39.60లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు కేటాయించారు. తాటిపూడి, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అదుగో ఇదిగో అంటున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అరకొర నిధులే మంజూరు చేసింది. జెఎన్‌టియు గురజాడ వర్శిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి నిధులు లేవు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా అన్ని అంశాల్లోనూ జిల్లాకు ఒరిగిందేమీ కనిపించలేదు. దళితులు, ఆదివాసీల జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించలేదని పలువురు విశ్లేషిస్తున్నారు. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. వివిధ శాఖలకు కేటాయింపులు కూడా తగ్గడంతో ప్రభుత్వం చెప్తున్న సుస్థిరాభివృద్ధి మేడిపండేనంటూ పలువురు విమర్శిస్తున్నారు.

రైతులను నిరాశ పరిచిన బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం శసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా రైతాంగాన్ని నిరాశ పరిచే విధంగా ఉంది. 62శాతం వ్యవసాయరంగంపై ఆధారపడుతున్న ప్రజలు బడ్జెట్‌లో గత ఏడాది కన్న రూ.2వేల కోట్లు కేటాయింపులు తగ్గించారు. వైఎస్ఆర్ పిఎం పసల్ పంటల బీమాకు కేటాయింపులు గత కన్నా రూ.200 కోట్లు తగ్గించారు. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులకు తగిన కేటాయింపులు లేవు. ఉత్తరాంధ్రలో ప్రధాన నీటి వనరు అయిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు అందించే దానికి బడ్జెట్‌లో ఎటువంటి హామీ లేదు. పాడి రైతులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన లీటరుకు రూ.4 పెంపు ప్రకటన చేసి ఏడాదవుతున్నా నేటికీ కేటాయింపులు లేవు. పాడి రైతులకు రాయితీపై దాణా, పశు ఇన్సూరెన్సు పరిహారం రెండేళ్ల నుంచి నిలిపవేశారు. ఈ బడ్జెట్ లో కూడా వాటి ప్రస్తావన లేదు.

– బి.రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మండలి ఓట్ల లెక్కింపులో
ఉత్కంఠ

తొలి రౌండ్ పూర్తయ్యేసరికి టిడిపి, వైసిపి హోరాహోరీ

కౌంటింగ్ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. ఓట్లన్నిటినీ కట్టలు కట్టి వేసే ప్రక్రియ సుమారు సాయంత్రం వరకూ సాగింది. మొదటి రౌండ్ ఫలితం వెల్లడయ్యేసరికి టిడిపి వెయ్యి ఓట్ల మేర వైసిపిపై ఆధిక్యతను కనబర్చింది. పిడిఎఫ్ మూడో స్థానంలో ఉంది. మొత్తంగా 28 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఒక రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కిస్తారు. మొత్తంగా 2 లక్షల పైచిలుకు ఓట్లు పోలైన పంగతి తెలిసిందే. గురువారం రాత్రి 9 గంటల వరకూ తొలి రౌండ్ ఫలితాన్ని సైతం అధికారులు వెల్లడించలేదు. రెండో రౌండ్ 9 గంటలకు ప్రారంభం అయ్యింది. రాత్రి 11 గంటలు దాటే సరికి 2 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. 3 రౌండ్లు లెక్కింపు పూర్తయ్యే సరికి రాత్రి ఒంటి గంట దాటే అవకాశం ఉంది. ప్రతి రౌండ్‌కూ 2 గంటలకు పైనే సమయం పడుతోంది.

రాత్రి 9.30 గంటల సమయానికి వెలువడిన సమాచారం మేరకు..

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు 8,854 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవగా వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 7,850 ఓట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 5346 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మొదట రౌండ్ ఓట్ల లెక్కింపు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినదని, అక్కడ టిడిపికి కాస్త మెజారిటీ ఉంటుందని తొలినుంచీ భావిస్తున్న విషయం చర్చనీయాంశమైంది. అనకాపల్లి ప్రాంతంలో కూడా టిడిపికి ఓట్లు అధికంగా వచ్చే వీలుందన్నది తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఒకటో రౌండ్ ఓట్ల లెక్కింపు అనంతరం మీడియాతో మాట్లాడుతూ చివరకు విజయం తనదే.. అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇంకా 1.70 లక్షల ఓట్లకు పైగా లెక్కించాల్సి ఉందన్నారు.

అధికారుల ఆకస్మిక ప్రకటనల గందరగోళం

మొదట రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వర్ణభారతి ఆడిటోరియంలో ఒక ప్రకటన చేస్తూ.. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి ఎదురుగా టిక్ మార్క్ పెట్టినా ఒకటి అని సూచించినా చెల్లుతుందని ప్రకటించారు. తొలుత ఈ అంశంపై క్లారిటీ ఇవ్వకుండా ఒక రౌండ్ పూర్తయ్యేసరికి ప్రకటించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మీడియాపై ఆంక్షలు

కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పష్టంగా మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లేందుకు పాస్‌లను మంజూరు చేసినా కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోకి మీడియా వారిని అధికారులు అనుమతించలేదు. గతంలో మూడు దఫాలుగా మీడియా ప్రతినిధులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. 2023లో మీడియాపై ఆంక్షలు విధించడం, లోపలకి వెళ్లాలని ప్రయత్నించే వారితో పోలీసులకు ఘర్షణలకు దిగడం జరిగింది. స్వర్ణభారతి స్టేడియం మొదటి గేటు వరకే గురువారం మీడియాను అనుమతించారు. దీంతో సమాచారం కోసం మీడియా నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

డిసిసిబి బ్రాంచుల్లో
రూ.2 కోట్లు హాంఫట్!

- బ్రాంచి మేనేజరే సూత్రధారి
- సహోద్యోగులను బలిపశువులు చేసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని రెండు డిసిసిబి బ్రాంచుల్లో రెండు కోట్ల రూపాయల మేర నిధులు కాజేసిన బాగోతంలో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. రామభద్రపురం, సాలూరు డిసిసిబి బ్రాంచుల్లో రూ.రెండు కోట్లకు పైగా నిధులు పక్కదారి పట్టాయి. కంచె చేను మేసిన చందంగా బ్యాంక్ నిధులకు రక్షకుడిగా ఉండాల్సిన బ్రాంచి మేనేజరే చాకచక్యంగా నిధులు కాజేసిన వైనం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాలూరు, రామభద్రపురం డిసిసిబి బ్రాంచుల్లో మేనేజర్‌గా పనిచేసిన కె.మదన్‌కుమార్ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో కింద స్థాయి ఉద్యోగుల అమాయకత్వం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేమి వంటి అంశాలను ఆసరాగా చేసుకుని రెండు కోట్ల రూపాయల మేర నిధులు మింగేసినట్లు తెలుస్తోంది. మేనేజర్ మదన్‌కుమార్ డిసిసిబి బ్రాంచుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు చెందిన ఎంప్లాయి ఐడిలతో బ్యాంక్ నిధులను దారి మళ్లించినట్లు స్పష్టమవుతోంది. తమ అధికారి ఎంప్లాయి ఐడి అడిగ్గానే అనుమానించకుండా ఇచ్చిన ఐదుగురు డిసిసిబి ఉద్యోగులు కూడా ఈ వ్యవహారంలో బలిపశువులయ్యారు. డిసిసిబి బ్రాంచిలకు సంబంధించిన సొమ్మును తెలివిగా తన సహోద్యోగుల ఎంప్లాయి ఐడిలతో వారి పేరిట ఖాతాల్లోకి మళ్లించి వాటి నుంచి తాను కోరుకున్న ఖాతాలకు దారి మళ్లించినట్లు తెలుస్తోంది. రెండు బ్రాంచీలకు చెందిన రెండు కోట్ల రూపాయలకు పైగా నిధులు కైంకర్యం చేసినట్లు రుజువైంది. శాఖాపరమైన విచారణ జరగడం, దానిలో నిధులు పక్కదారి పట్టాయని నిర్ధారణ కావడంతో డిసిసిబి జిల్లా అధికారులు మేనేజర్‌తో పాటు కింద స్థాయి ఉద్యోగులు జి.రామకృష్ణ, ఆర్.వినీలా, సింహాచలం నాయుడు, శ్రీదేవి, శశిభూషణరావును సస్పెండ్ చేశారు. ఈ కుంభకోణంలో కింద స్థాయి ఉద్యోగుల పాత్ర ప్రత్యక్షంగా లేకపోయినా జిల్లా అధికారులు వారిపై వేటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్రాంచి మేనేజర్ మదన్ కుమార్ అడిగిన వెంటనే తమ ఐడిలను ఆయనకు ఇవ్వడమే వారు చేసిన పెద్ద తప్పుగా కనిపిస్తోంది.

పోలీసులకు ఫిర్యాదు

సాలూరు డిసిసిబి బ్రాంచిలో జరిగిన కుంభకోణానికి సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్ పోలీస్ స్టేషన్లో డిసిసిబి అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై టౌన్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, అవినీతి జరిగినట్లు ఆధారాలు అందజేయాలని కోరినట్లు చెప్పారు.

పలుచోట్ల వర్షాలు

వంగర.. మొక్కజొన్న వెన్నులపై కప్పిన టార్పాలిన్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పలుచోట్ల సోమవారం సాయంత్రం తేలికపాటి వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిశాయి. ఉత్తర తమిళనాడు నుంచి కర్నాటక మీదుగా కొంకణ్ తీరం వరకు అల్పపీడనం ద్రోణి కొనసాగడంతో రాబోయే మూడురోజులు పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. తెర్లాం, మెంటాడ, మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి, గుర్ల, గజపతినగరం, బొబ్బిలి, ఎస్.కోటలో వర్షం కురిసింది. దత్తిరాజేరు మండలంలో సుమారు అరగంటపాటు కొద్దిపాటి వర్షం కురిసింది. రామభద్రపురం మండలం ఆరికతోట, నర్సాపురం గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మినప పంట మట్టించేందుకు సిద్ధంగా ఉన్న రైతులు ఈ వర్షంతో ఇబ్బంది పడుతున్నారు.

బొబ్బిలి : బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో గురువారం చిరుజల్లులతో వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న చిరుజల్లులతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం రబీ, మామిడి, జీడి మామిడి పంటలకు బాగు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంగర : మండలంలో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. గ్రామాల్లో మొక్కజొన్న పంట కోత దశకు రావడంతో కొన్నిచోట్ల కోసి ఎండబెట్టిన సమయంలో వర్షం పడటంతో రైతులు వాటిని వాటిని రక్షించుకునే పనిలో పడ్డారు.

అమరజీవికి ఘన నివాళి

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- విజయనగరం

అమర జీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు, మహనీయుడు అని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు తదితరులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జెసి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16 న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని, ఆయన త్యాగం ఫలితంగా నే ఆంధ్ర రాష్ట్రం 1956 నవంబర్1 న ఏర్పడిందని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడని, తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సర కాలంలో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడని అన్నారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనవారని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కషిచేసిన మహనీయుడని కొనియాడారు. డిఆర్ఒ గణపతి రావు మాట్లాడుతూ మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాల నుంచి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి దీపిక నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి యశోధన రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఆఫీస్ సబార్డినేట్స్, సంఘ సభ్యులు ఎస్ శ్రీనివాసరావు, టి.తేజ, కె.అప్పలరాజు, ఆర్.భూలోకం తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

1122 మంది గైర్హాజరు.. ఇద్దరు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్ష (తెలుగు, సంస్కృతం) గురువారం ప్రారంభమైంది. మొత్తం పరీక్షకు 23664 మంది హాజరు కావాల్సి ఉండగా 22542 మంది హాజరయ్యారు. 1122మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 19250 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 18,445 మంది హాజరయ్యారు. 805 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 4414 మంది హాజరవ్వాల్సి ఉండగా, 4097 మంది మాత్రమే హాజరయ్యారు. 317 మంది హాజరు కాలేదు. మొత్తంమీద 1122 మంది రెండోరోజు పరీక్షలకు గైర్హాజరయ్యారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి, ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీసుకు పాల్పడటంతో వారిద్దరినీ డిబార్ చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

కొత్తవలస.. పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

కొత్తవలస : ఇంటర్ పరీక్షా కేంద్రాలను గురువారం కలెక్టర్ ఎ.సూర్యకుమారి తనిఖీ చేశారు. కొత్తవలసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు చేసిన ఏర్పాట్లపై ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటుపై ప్రశ్నించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐఒ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, 8 పరీక్షా కేంద్రాలను డిఇసి తనిఖీ చేశారు. వీరే కాకుండా స్క్వాడ్ బృందాలు, ఇతర అధికారులు సైతం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జెసి

వేపాడ : వేపాడ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షా కేంద్రాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిశీలించారు. పరీక్షకు 275 మందికి గాను 259 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు.

వంగర : మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్ రెండో సంవత్సరం తెలుగు, హిందీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 198 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 196 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇద్దరు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొత్తవలస



వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం ఐసిడిఎస్ సిడిపిఒకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తెలంగాణాను మించి అంగన్వాడీలకు ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీలకు ఫేస్‌యాప్ రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటీ, ఇతర అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కాకర తులసి, కె.పద్మ, ఎన్.పార్వతి, చిలకమణి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తల్లిదండ్రులు అనారోగ్యం పాలై, కళాశాల ఫీజు చెల్లించలేని కాలేజీ విద్యార్థికి ఫీజు చెల్లించేందుకు వాసవీ క్లబ్ ముందుకు వచ్చింది. గాజులరేగకు చెందిన కూర్మాదాసు శ్రావణి లెండి కళాశాలలో ఫైనలియర్ బి.టెక్ చదువుతుంది. ఇటీవల తల్లిదండ్రులు ఒకేసారి అనారోగ్యం పాలై మంచానపట్టి వున్నారు. ఈ పరిస్థితిలో కళాశాల ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలిసి, వాసవీ క్లబ్ సభ్యులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సహకారంతో రూ 35 వేలు కళాశాల ఫీజు, 3 వేలు పరీక్ష కోసం, 2 వేలు ఆటో ఛార్జీల కోసం అమ్మాయికి అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బలబదని నానాజీ, సీతారామయ్య శెట్టి, కుమ్మరిగుంట శ్రీనివాసరావు, డిమ్స్ రాజు, కూసుమంచి వెంకటరావు, గుంపిన నారాయణరావు,ఎం.సి.హెచ్.గుప్త, ఎవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్

రీ సర్వేకు సహకరించాలి : జెసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భూ రీసర్వేకు రైతులు సహకరించాలని జెసి మయూర అశోక్ అన్నారు. మండలంలోని కొండ గుంపాంలో గ్రామంలో జరుగుతున్న భూ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. దీనికి ముందు గ్రామంలో తహశీల్దారు కెవి రమణరాజు, గ్రామ సర్పంచ్ పతివాడ అప్పన్న ఆధ్వర్యంలో సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ప్రతి ఒక్కరు ఈ సర్వేకు వచ్చిన సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కృష్ణారావు

ప్రజాశక్తి-బొబ్బిలి

న్యాయ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్.కృష్ణారావు ఎన్నికయ్యారు. కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర సమావేశంలో బొబ్బిలి కోర్టులో పని చేస్తున్న కృష్ణారావును విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కృష్ణారావుకు కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు. న్యాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పని చేస్తామని కృష్ణారావు చెప్పారు.

ఆక్రమిత భూముల్లో బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని మిరాకిల్ సంస్థ ఆక్రమిత భూముల్లో తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు గురువారం బోర్డులను ఏర్పాటు చేశారు. కొండవానిపాలెం, ముంజేరు, కంచేరు రెవెన్యూ పరిధిలో సుమారు 8.52 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. అసైన్డ్ భూములుగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

'సీతం'లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఆ కళాశాలతోపాటు డాక్టర్ రెడ్డీస్ సంయుక్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఏర్పాటు చేశాయి. ఈ శిక్షణను సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, రెడ్డీస్ ల్యాబ్ సీనియర్ డైరెక్టర్ కెవిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. ఎంపిక చేసిన 65 మంది అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి తరువాత డాక్టర్ రెడ్డీస్‌లో ఉపాధి కల్పిస్తారని సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీతం కళాశాల ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి, డాక్టర్ రెడ్డీస్ డైరెక్టర్ కెవిఎస్ఎన్ రాజు మాట్లాడారు. సీతం ఉద్యోగ శిక్షణ అధికారి బికె రావు శిక్షణను పర్యవేక్షిస్తారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సురక్షితంగా ఉంటుందని ఫీల్డ్ కోఆర్డినేట్ బి.గోవిందరావు తెలిపారు. విత్తనాలను గుళికల రూపంలో చేసుకొని భూమిలో వేసుకోవడం వల్ల విత్తనాలకు రక్షణ ఉంటుందని క్లస్టర్ సిఆర్‌పి బి.శ్యామల రైతులకు తెలియజేశారు. క్లస్టర్ సిఎ ఎం.శ్రావ్య, గొల్లలపాలెం గ్రామైక్య సంఘం ప్రెసిడెంట్ నంబారు కనకమహాలక్ష్మి, ఇంటర్నల్ కమ్యూనిటీ రీసెర్చ్ పర్సన్ నంబారు భవాని పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ తీర్థం

ప్రజాశక్తి-వేపాడ

పోటీల్లో పాల్గొన్న గుర్రం

మండలంలోని బొద్దాం గ్రామంలో ఆంజనేయ స్వామి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ పాల్గొని, ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనపరెడ్డి రాంబాబు, మండల మాజీ అధ్యక్షుడు జనపరెడ్డి ఈశ్వరరావు, నాయకులు జి.రాము, సేనాపతి అప్పారావు, కొటాన అర్జునరావు, బెహరా నాగేశ్వరరావు, పి.సత్యంనాయుడు, ఏడవక రమణ, లంక శ్రీను, కె.రమణ, ఈశ్వరరావు, బి.ప్రసాద్, చంటి, సతీష్, బి.నాగు, వెంకట్రావు పాల్గొన్నారు. జాతర సందర్భంగా గుర్రపు పరుగు పోటీలు ఏర్పాటుచేసి, విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

హెచ్‌ఐవి బాధిత పిల్లలకు న్యూట్రిషన్ ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మాళా దినోత్సవం సందర్భముగా విశాఖపట్నంకు చెందిన రెండు స్వచ్ఛంద సంస్థలు జిల్లాలోని 10 మంది హెచ్‌ఐవి బాధిత పిల్లలకు ఆహార సరుకులు, పిల్లలకు బట్టలు, కేర్ టేకర్ కు చీరలను గురువారం జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభ తమ కార్యాలయంలో పంపిణీ చేశారు. వైఆర్‌జి కేర్ సంస్థకు చెందిన సుబ్బలక్ష్మి, సేవా సమాజం సంస్థ అధ్యక్షులు మౌనికా శర్మ, తదితరులు వీటిని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో సాక్షి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీల్లో పన్నులు త్వరితగతిగా వసూలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని పాలకొండ డివిజనల్ పంచాయతీ అధికారి జె.రాంప్రసాద్ అన్నారు. గురువారం మేజర్ పంచాయతీ సచివాలయం వద్ద మండలంలో గల 20 సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలంటే పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ అభివృద్ధికి పన్నులు కొంతమేరకు ఉపయోగపడతాయని, కావున పన్నులు వసూలు చేయాలని సూచించారు. పంచాయతీల్లో పారిశుధ్య లోపం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అలా అయితే గ్రామాల్లో ప్రజలు ఎవరూ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య వంతంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అభివృద్ధి ఊసేది?

రాష్ట్ర బడ్జెట్‌పై రాజకీయ పార్టీలు, మేధావుల పెదవివిరుపు

అసమానతలు తగ్గించే బడ్జెట్

ప్రజలందరికీ మెరుగైన వైద్యం, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు, రైతుల మోములో సంతోషం, అక్క, చెల్లెమ్మల కళ్ళలో ఆనందం ఇలా సమాజంలో అసమానతలు తగ్గించి, పేదరికాన్ని రూపుమాపే ధీటైనా బడ్జెట్ ఇది. అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాలను సంతృప్తి పరిచే బడ్జెట్. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

- మజ్జి శ్రీనివాసరావు,వైసిపి జిల్లా అధ్యక్షులు

అంకెల గారడీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. ఇప్పటి వరకు కేటాయింపులు తప్ప ఖర్చు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. కేటాయింపులు వలన ఉపయోగం లేదు. ఖర్చు చేసినప్పుడే బడ్జెట్ కేటాయింపులకు అర్థం ఉంటుంది. సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపులు ఎక్కువ చేశారు. ఉపాధి అవకాశాల కోసం మాత్రం ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. ఇది నిరుద్యోగులకు నిరాశ నిస్పృహలకు గురి చేస్తుంది.

– కె.అప్పలనాయుడు, అర్థ శాస్త్ర పూర్వ అధ్యాపకులు

మోసపూరిత బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి పూర్తి వ్యతిరేక మైనది. జిల్లాలో పూర్తికాని పాజెక్టులు అనేకమైన ఉన్నాయి. నీటిపారుదల రంగానికి బడ్జెట్లో 4శాతం కేటాయించారు. ఇంత తక్కవ ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వ్యవసాయ రంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో చెప్పాలి. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి ఎటువంటి నిధులు కేటాయింపు లేవు. ప్రజలను దగా చేసే మోసం చేసే బడ్జెట్ ఇది. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారంటే రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంక్షేమ పథకాలు కోసం అప్పులు చేసిన బడ్జెట్ లా ఉంది తప్ప రాష్ట్రాభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడేలా లేదు. అభివృద్ధి కోసం గత బడ్జెట్ లో 32 వేల కోట్లు కేటాయించినా కేవలం 12 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారు. ఈ బడ్జెట్ లో కేటాయింపులు చూపించారు తప్ప గత ఏడాది మాదిరిగానే ఆచరణలో ఖర్చు కనిపించే ఆవకాశం లేదు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారు. నవరత్నాలు కోసం తప్ప రాష్ట్రాభివృద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగుదల కోసం ఏ మాత్రం బడ్జెట్ కేటాయింపులు లేవు. అప్పులు ఫుల్ అభివృద్ధి నిల్ మాదిరిగా బడ్జెట్ ఉంది.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

అంకెలు తప్ప అభివృద్ధి ఏదీ?

ఇది అంకెల గారడి బడ్జెట్. బడ్జెట్‌లో అంకెలు తప్ప అభివృద్ధి ఏమీ లేదు. సంక్షేమానికి, అభివృద్ధికి పొంతన లేదు. కేవలం మద్యం రూపంలోనే ఆదాయం పెంచుకోవడం పద్ధతి కాదు. అప్పులను ఆదాయంగా చూపించడం దారుణం. సాగు, తాగు నీటి ప్రాజెక్టు లకు తగినంత కేటాయింపులు లేవు. జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని స్పష్టమవుతోంది.

- గురాన అయ్యలు, జనసేన నాయకులు

జిల్లాకు మొండిచేయి

రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరంజిల్లాకు మొండిచేయి చూపించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు లేదు. ఉత్తరాంధ్రను చిన్నచూపు చూస్తున్నారు. వ్యవసాయ రంగానికి గాని, కార్మిక సంక్షేమానికి గాని, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు గాని బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవు.

- సరగడ రమేష్‌కుమార్, డిసిసి అధ్యక్షులు

జిల్లాకు కేటాయింపులేవీ?

జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయింపు చేయడంలో జిల్లా ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. రాష్ట్ర బడ్జెట్ కేటాయింపునకు, మూలధన ఖర్చులకు పొంతన ఉండటం లేదు. తారక రామతీర్థ సాగర్‌కు రూపాయి కూడా కేటాయించక పోవడం దారుణం. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక శాఖలను నిర్వీర్యం చేశారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు 26 శాతం తగ్గించామనడం అంతా బోగస్. పెట్టుబడి పెరగడం, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల్లో కోత విధించడం అన్యాయం.

– కిమిడి నాగార్జున, టిడిపి జిల్లా అధ్యక్షులు

ప్రాజెక్టుల ఊసే లేని బడ్జెట్

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.2.79 లక్షల కోట్ల బడ్జెట్లో ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ఊసే లేదు. ఇది అంకెలు గారడీ బడ్జెట్ తప్ప ఇంకొకటి కాదు. రాష్ట్రంలో ప్రతి ఒక్క పౌరుని తలమీద రూ.30 లక్షల అప్పు ఉంది. ఇంకా ఎక్కడి నుంచి తీసుకొచ్చి అప్పుల్లో ఈ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతారు. జగనన్న విదేశీ విద్యా దీవెనకు మూడు సంవత్సరాల నుండి నిధులు ఇవ్వకపోవడంతో ఇతర దేశాల్లో చదువుతున్న విద్యార్థులు తిరుగు ముఖం పడుతున్నారు ఇంతకంటే సిగ్గుచేయడం మరొకటి లేదు.

- భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, బిజెపి నాయకులు

అభివృద్ధి కానరాని బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్‌లో దళిత, ఆదివాసీల కాంపోనెంట్‌లో సంఖ్యలు పెంచారే తప్ప వారి ఆర్థిక అభివృద్ధికి ఒరిగేదేమీ లేదు. సబ్ ప్లాన్ చట్టాన్ని ప్రభుత్వమే ఉల్లంఘిస్తోందని బడ్జెట్ కేటాయింపులను బట్టి తెలుస్తోంది. జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్‌సిలకు 26,194 కోట్లు కేటాయించాల్సి ఉండగా 20005 కోట్లు, ఎస్‌టిలకు 8465 కోట్లకు 6929 కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులుదులుపుకుంది. .

- పి.చిట్టిబాబు, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

భావితరాలకు స్ఫూర్తి పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంటౌన్..పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు, అధికారులు, సిబ్బంది

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీ రాములునాయుడు అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి కమిషనర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఇఇ శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు, టిపిఆర్ఒ సింహాచలం, మేనేజర్ ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించాలి

పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ ఆంధ్రదేశం కోసం అశువులు బాసిన పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, వెత్స సత్యన్నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : నారాయనప్పవలస పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జెసి రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడో తరగతి విద్యార్థి మనోజ్ వేసిన పొట్టిశ్రీరాముల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాశ్, ఎం.శ్రీనివాసరావు, రామచంద్ర రావు, మురళి, మహేష్ పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన తహశీల్దారు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కుంకల పండు, పూసర్ల సాయి, మండల మందుల షాపు వర్తకుల సంఘం ప్రెసిడెంట్ విన్నకోట సతీష్, కేదారిశెట్టి శ్రీనివాసరావు, మణికొండ రాజేష్, దేవాడ వాసవి క్లబ్ సెక్రటరీ మామిడి సన్యాసిశెట్టి, కందుల ప్రకాష్, విన్నకోట శ్రీరామమూర్తి, విన్నకోట రాజేష్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు పాల్గొన్నారు.

గజపతినగరం : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ పి.సుదర్శన్ మండల పంచాయతీరాజ్ అధికారి పి.అప్పలనాయుడు.. పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

పట్టణంలో కనీస వసతులు కరువు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో కనీస వసతులు కరువయ్యాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక పేర్కొంది. ఈ మేరకు గురువారం పట్టణంలో వేదిక సభ్యులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజిపేట రహదారి విస్తరణ పనులు తొమ్మిది నెలల నుంచి నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. తక్షణమే ఈ రహదారి విస్తరణ పనులు పూర్తి చెయ్యాలని కోరారు. 70 వేల జనాభా ఉన్న పట్టణంలో రైతుబజారు లేకపోవడం దారుణమన్నారు. సువర్ణముఖి నది నుంచి నీరు తీసుకొచ్చే పనులు వేగవంతం చేసి, సరఫరాలో లోపాలను సరిదిద్ది నిత్యం తాగునీరు పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. రాణి మల్లమ్మదేవి పార్క్ వద్ద వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. పట్టణంలోని బజారు రోడ్డు, కళాశాల రోడ్డును విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, ప్రగతిశీల కార్మిక సంఘం అధ్యక్షులు టి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదరామునాయుడుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు జాగరపు పెదరామునాయుడుకు గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. సర్పంచ్, ఎంపిటిసి పదవులను అధిరోహించిన ఆయన అనారోగ్యంతో ఈ నెల 13న మృతిచెందిన విషయం తెలిసిందే. గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్, నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎస్‌డిటి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, బాణాది ఎంపిటిసి గొంప తులసి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల రమణ, తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

చేపల పెంపకంలో మెలకువలు పాటిస్తే లాభాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

చేపల పెంపకంలో మెలకువలు పాటిస్తేనే మంచి లాభాలు వస్తాయని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి, వైసిపి కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు అన్నారు. బైరిసాగరం చెరువు వద్ద ఉన్న చేపల అమ్మకం భవనంలో గురువారం గిరిజన మత్స్యకారులకు చేపల పెంపకంపై శిక్షణను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేపల పెంపకంతో మంచి లాభాలను పొందవచ్చన్నారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోష్ మాట్లాడుతూ ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్న చేపల్లో 30 శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్తున్నాయని చెప్పారు. మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖాధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రౌతు రామమూర్తి

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -భోగాపురం

అంగన్వాడీల వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి కార్యకర్తలు గురువారం ఐసిడిఎస్ సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న టిఎడిఎలు విడుదల చేయాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి సూర్యనారాయణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు కోర్లమ్మ, అనిత, సుజాత, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి -భోగాపురం

పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్న జన సైనికులందరికీ ప్రత్యేక ధన్యవాదాలని జనసేన నియోజకవర్గం ఇంఛార్జి నాగమాధవి ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన పదో ఆవిర్భావ సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ ఆశయాలకు, సిద్ధాంతాలకు, అనుగుణంగా ప్రతి ఒక్క జనసైనికుడు కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికలకు సంసిద్ధత కావాలని పిలుపునిచ్చారు.

సంచార పశువైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-వేపాడ

పశువులకు చికిత్స చేస్తున్న ఎడి చలపతిరావు

సంచార పశువైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ ఎడి బి.చలపతిరావు కోరారు. గురువారం నీలకంఠరాజపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని చినగుడిపాల గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరంతోపాటు సంచార పశు వైద్య సేవలను, పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే రైతు వాకిట్లో సంచార వాహనం ద్వారా సిబ్బంది వచ్చి మెరుగైన అత్యవసర సేవలను అందజేస్తారని రైతులకు సూచించారు. 105 పశువులకు తనిఖీలు చేసి, మందులను పంపిణీ చేశారు. 40 పశువులకు గర్భకోస వ్యాధులకు చికిత్సల చేశారు. అనంతరం రైతులకు పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఖనిజ లవణాల మిశ్రమ ప్యాకెట్లను, మందులను పంపిణీ చేశారు. ఈ నెలాఖరులోగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధకటీకాల కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఎడి ఆదేశించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి బి.సింహాచలం నాయుడు, సర్పంచ్ బోజంకి రామునాయుడు, విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ నాయుడుబాబు, సీతారామ్మూర్తి రాజు, బానాది, కె.ఆర్ పేట ఎహెచ్‌ఎలు సతీష్, కాంతారావు, గోపాలమిత్ర బి.సింహాద్రప్పడు, విశాఖ డెయిరీ సిబ్బంది కన్నం నాయుడు, రైతులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొంప కృష్ణ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి పంచాయతీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలి, సర్వం కోల్పోయిన కుటుంబానికి టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప క్రిష్ణ గురువారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి, ఓదార్చారు. అండగా నిలుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మాజీ సర్పంచ్ ఏడవక రమణ, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు లంక శ్రీను, కుడితి రవణ, వల్లభ ఈశ్వరరావు, నాగిరెడ్డి రమణ పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై ఖైదీలకు అవగాహన

బొబ్బిలి : జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, సాతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన బొబ్బిలి సబ్‌జైల్‌లో ఖైదీలకు హెచ్‌ఐవి, సుఖవ్యాధులపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం జైల్లో ఉన్న ఖైదీలకు హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, సబ్‌జైల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఐసిటిసి కౌన్సిలర్ ఆదయ్య, పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ ఎం.పద్మ, సాతి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మేనక, సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-2లో గర్భిణులు, బాలింతలకు గురువారం సర్పంచ్ బీల రాజేశ్వరి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకుని, తల్లి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు.

పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

వేలం ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ Excise మేజిస్ట్రేట్ వారి కోర్టులో
O.S.447/2017 EP 91/2018
Between:
శ్రీ భోగాపురపు వెంకటరమణ ......డిక్రీహోల్డరు
Vs
మహమ్మద్ అబ్దుల్ కరీమ్ ....జడ్జిమెంటు-డెబిటార్
పై నెంబరు అమలులో డిక్రీ హోల్డరు వారు అమలు పైకం వసూలు చేయుటకు పై కోర్టులో అమలు దాఖలు చేసినారు. ఈ దిగువ తెలుపబడిన షెడ్యూలు దాఖలా ఆస్తిని **తే 10-4-2023దీ**న పై కోర్టు **ఉదయం గం॥ 10-30 ని॥**ల నుండి సాయంకాలం 5గంటల లోపు యీ దిగువ తెలుపబడిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయుబడునని ఎవరైన సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు పై కోర్టులో హాజరు అయి వేలం పాటలో పాల్గొనవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది.
షెడ్యూలు : 1st Floored RCC Slabed house bearing door no 14-5/1-6B in S.No.732 to on extant 33.33 Sqr-yards situated at Kammaveedhi, Vizianagaram Mandalam.
Bounded: East: Joint wall of this Property and Md Hussein, **South:** Property of Sobatla Krishna, **West :** Joint Wall of his Property and Md. Hussein Properties, **North:** Three feel - Rasta cement road.
P.HARA GOPAL
Advocate,
Vizianagaram
Vizianagaram
Dt: 16-3-2023

నోటీసు
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
OS No.124/2022
Between:
గుడివాడ పాపినాయుడు .....వాదులు
AND :
మీసాల పెంటము నాయుడు .....ప్రతివాదులు
మీసాల కార్తీక్
టు
R2. మీసాలు కార్తీక్ S/o పెంటము నాయుడు, హిందూ, వయసు 26 సం॥, కొండపేట గ్రామం, జిన్నాం పోస్ట్, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా,
పై నెంబర్ పిటిషన్ లో మీరు నోటీసు అందుకొనక పోవుట వలన పేపరు ప్రకటన ద్వారా నోటీసును జారీచేయుటకు ఉత్తర్వులు పై కోర్టువారు ఇచ్చియున్నారు. కావున పై దావా **తేది 17-04-2023 దికి** వాయిదా ఉన్నందున **ఉదయం 10-30 గం॥** "శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని మీ యొక్క న్యాయవాది ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేయవలసిందిగా ఆదేశించియున్నారు. అందుకు తప్పిన యెడల మీ పరోక్షంతో కోర్టువారు తదుపరి ఉత్తర్వులు గైకొందురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
// శ్రీ కోర్టువారు వారి ఉత్తర్వులతో //
శ్రీ పొట్నూరు శ్రీను.
శ్రీ కిలపర్తి సన్యాసి రావు.
వాదులు తరుపున న్యాయవాదులు,
గజపతినగరం
గజపతినగరం
తేది: 16-03-2023